

# సీత కథ

శివరాజు సుబ్బలక్ష్మి

సీతా, మంజూ, రాధికా—ముగ్గురూ మూడు గుణాలకి గుత్తదారుల్లా ముద్రవేసేసుకున్నారు. వీధిబడిలో రక్షుకోవటం, కొంచెం పెరిగి గిల్లుకోవటం మరికొంచెం పెరిగి మూతి విరుపులూ—ముక్కుపుటాలెగరేయటంతో వయస్సూ చదువూ పెరిగి—స్కూలువదిలి కాలేజీకి పొమ్మనే రోజు వొచ్చేసింది. సీత చదువుకి చుక్కపెట్టించేశారు...సీత ఇంటివాళ్లు! మంజూకి మరో రెండేళ్ల చదువుకో అనే అండ అప్పగారి అధ్వర్యంలో దొరికింది. రాధికకి ఎవరి ఆజ్ఞలు, ఆంక్షలూ లేవు. కానీ తల్లి అంటే గిట్టదు. తండ్రిఅంటే భయం లేదు. అసలు ఎవర్నీ లెఖ్కచెయ్యదు. మొగాళ్లంటేనే ఈసడిస్తుంది. 'అందుకే వాళ్ల నాన్న చదివిస్తారుట'అంటుంది మంజుల.

సీతకి పెళ్లి ఎప్పుడు కుదిర్చారో కాని చాలా నిరాడంబరంగా ముడెట్టించేసి, వో వారంలోనే ప్రయాణం కట్టించి పంపించేశారు అత్తవారింటికి! అదేం అదృష్టమో సీతమ్మ తన పేరుని సార్థకం చేసుకొంది. వెళ్లిన ఆరుమాసాల్లోనే, ఇంటిని నిభాయించే పెద్దబావగారికి గుండె నిలిచిపోయింది. నక్కమొహంతో నారదబుద్ధులతో, ఇల్లుని పట్టుకు తినే దూరపు బంధువు మంచానపడి మూణ్నెల్లు ఏడిపించి కన్నుమూశాడుట. సీత వూపిరితీసుకునే ఆనందపు ఘడియల్లో—సీతపతిగారిని ఆఫీసులో కుర్చీ ఖాళీ చేయించేశారుట. మరోవూరికి పొట్ట పట్టుకొని పోవలసొచ్చింది. పోనీ, కొత్తవూళ్లోకాపరం పెట్టుకు సుఖపడదామనుకుంటూ వుండగా—సీత తల్లికి పిచ్చెక్కిందనే నెపంతో తండ్రి మళ్లీ పెళ్లికొడుకయ్యాడని తెలియపర్చారుట. అంతే ఇహ!

సీత నిజంగానే పిచ్చిగా మారి అందర్నీ తిట్టటం, గిల్లటం, జుత్తు పీక్కోవటం మొదలెట్టింది. అదలా పెరిగి చుట్టూవున్న వాళ్లని దూరంగా గెంటేసుకొంటూ, మనస్సులో ముళ్లపొదల్ని పెంచుకొనే సమయానికి, మంజూకి 'మరో మూడేళ్లు చదవ్వొచ్చు' అనే అప్పగారి హుకుం దొరికింది.

అందుకే, సీతవున్న వూరిలోని కాలేజీలో చేరింది. ఇల్లు వెదుక్కుంటూ సీతని చేరింది. కాని సీత చూపు మారింది. రూపంలో వికారం పుట్టింది...మంజూకి భయమేసి వెనక్కి నడిచింది. కంట తడి రాలేదు. జాలి వెయ్యలేదు. అంతే. వచ్చినట్టే వెళ్ళింది. హాస్టల్లోకూర్చొని కళ్లుతెరిచినామూసినా సీతరూపే కనపడుతోంది-అంటూ అర్ధరాత్రి అరుపుల్తో పక్కవాళ్లని హడలకొట్టింది. మంజూకి జ్వరం అన్నవార్త హాస్టల్లో మారుమ్రోగింది. జ్వరం తగ్గేక, వూరికెళ్ళిన మంజూ మళ్ళీ కాలేజీకి రాలేదు. ఏడాది తిరిగింది. 'అక్కపోయిందిట—బావని ఎవరు చూస్తారని' అమ్మ కంటతడి పెట్టుకుంటే మంజూ తలొంచి వొప్పేసుకుందిట. సీతకి ఎవరో ఆ వార్త చెప్పారుట. సీతకి ఏడ్పువచ్చిందిట. మామూలు మనిషిగా మాట్లాడి ఆరితేరిన ఇల్లాలికి మల్లే ఇంటిని తీర్చి దిద్దుతోందిట. కానీ ఏం లాభం? ఈ పిచ్చికి తిరుగువుండదని దృఢంగానమ్మి మరో అమ్మాయికి మాట ఇచ్చేసిన సీత భర్తకి మతిపోయినట్లుంది. సీతలో ఈర్ష్య చిగురించింది. వాదనలూ వర్షాలూ పిడుగుల్లాంటి రాద్ధాంతాలలోకి ఆరిందాలా ప్రవేశించేసి ఇంటిని కోర్టుగా మార్చేసుకొందిట.

ఆ సమయంలోనే మంజూకి వుత్తరం రాయాలనే కోరిక పుట్టింది సీతకి. ఓ గుణపాఠం నేర్పేదృష్టితో ఇలారాసింది.

'నా మంజూ,

నువ్వు తెలివిగా ప్రవర్తించానని విర్రవీగుతున్నావేమోనే వెర్రిమొహమా! మీ బావకి వెనక్కి జరిగినకాలం చాలా అపురూపమైనదే! అటువంటి సున్నితమైన వయస్సూ, లేతమనస్సూ, చల్లని ఆ

వెన్నెలా ఆ రోజులూ అవన్నీ గతానికి, అంటే మీ అక్కకే పరిమితం చేసేసి మిగిలిన మీ బావని ఏం బావుకుందామని కట్టేసుకున్నావో నాకర్థంకావటంలేదే! నీలోని పసితనాన్నిచూసి మురిసే మరో సమవయస్కుడు దొరకడని భయ పడ్డావా? లేక మీ అక్క జవ్వారీమీద మోజు పడ్డావా? నిజం వొప్పేసుకు వుత్తరం రాస్తావని తలుస్తా!'-అంటూ నిలేసినట్లురాసిన సీతపైనా,సీత వుత్తరం పైనా మంజూకి మొదటకోపంవొచ్చింది. తర్వాత సీతరాసిన దాంట్లోంచి నిజం తొంగిచూసినట్లన్పించింది. అదే మాట-మరోలా అమ్మ తనకి రహస్యంగా బోధించింది.

'నీ చదువుకి మీ బావ ఖర్చుపెట్టాడు. నీకు బోలెడు గుడ్డలు కొన్నాడు. నాకూ బోలెడు పెట్టాడు. అదేమో కన్ను మూసిందా! మనకి తలదాచుకునేందుకు కొంపా గోడు లేదాయె!' అంటూ కంట తడిపెట్టుకుంది...'పోనీ నువ్వు-నువ్వ చేసుకుంటావా? మనం ఋణపడ్డామన్న బాధవుండదు. అది నువ్వే ఆలోచించాలి. నీకంటే వయస్సులో కాస్త ఎక్కువ తప్ప ఎందులోను ఏలోపం రానివ్వడు!'—అంటూ సమర్థించి తన బుర్రకి ఏ ఆలోచనా రాకుండా చేసింది.

తను యెందుకు వొప్పేసుకుందో! తనకే అర్థం కావడంలే దిప్పుడు. సీత వ్రాసినట్టు తన అక్క నగలూ బట్టలూ బైటకి పోతాయేమోనన్న దుగ్దే కారణం కావొచ్చు. చిత్రం. మరి, ఇప్పుడు వాటిని చూస్తేనే తనకి ఎందుకో అంత అసహ్యం పట్టుకుంది. వూరికే కోపం వచ్చేస్తోంది. అక్కగురించి మాటలు బావనోటంట వస్తే తనకి సూదులు గుచ్చిన అనుభూతి కలుగుతోంది. ఇందాకా తనలో పుట్టిన ఈర్ష్యకావచ్చు. ఏమో అలా అనటం న్యాయంకాదు. అసలు ఈర్ష్య అంటే ఏమిటో తనకీ తెలియదు. తనని ఎవరితో సరిపోల్చి పెంచారు గనుక! ఏదో తల్లిదగ్గర వున్నప్పుడు తల్లే పొట్ట నింపింది. తరవాతమాత్రం, అక్క ఎక్కడ తనని సరిగా చూసింది? అబ్బే—వాళ్లు తినే టప్పుడు తను రాకూడదనేది. వాళ్ళ మాటలమధ్య పలకకూడదట. వాళ్ళతో సినిమాలకీ, షికార్లకీ అసలే పనికిరాదు. అప్పుడు పుట్టని ఈర్ష్య యిప్పుడేమిటీ!

అప్పట్లో అప్పుడప్పుడూ బావ ఓర చూపుల్తో తనకి దగ్గిరకావాలని చూసి నట్టు అనిపిస్తోంది, ఇప్పటి మాటల తీరులో! కానీ తను దూరంగానేవుంది. ఆ మాటకి వొస్తే ఇప్పుడూ అంతే. బావలో మార్పు వచ్చేస్తోంది. అవి తియ్యకూడదు, ఇవి తియ్యకూడదు అనే ఆ ఆంక్షలేయటంచూస్తే తట్టుకోలేను కొస్తోంది.

సీతకి బదులు ఏమని వ్రాయాలో అనుకుంటూ ఆ రాత్రికి జాగారం చేసే సింది. వేగుచుక్కని చూసి, వుత్తరం పూర్తిచేసి, కుర్చీలోనేకునుకుత్తూ, తనూ తన చిన్నతనం తలుచుకొంది. తనపై తనే బోలెడు జాలిపడి ఏడ్చేసుకుంది. సీతకి రాసిన వుత్తరాన్ని పోస్టుడబ్బాలో వేయించేక, తేలికపడి నిద్దరోయింది, మంజూ!

సీతకి చాలాకాలంతర్వాత బరువైన వుత్తరం వచ్చింది. సీత కవరుని అన్ని పక్కలా తిప్పుకుంటూ మురిసింది. అవసరం లేకపోయినా వారా వీరా అని పలకరించి, స్నేహితురాలు రాసిందంటూ కవరుపై ఎడ్రస్‌ని ముందుంచి, మురి పించి, అంతా మాటు మణిగాక, వంట రిగా కూర్చుని కవరు చించింది. కాయి తాలు బైటికితీసి, మంజూని చూస్తు న్నట్లు కంటతడిపెట్టేసుకు మధ్య మధ్య కళ్ళంట కారే నీటిని వేలితోతీసి, దూరంగా విసిరింది...అందరికీ తన దుఃఖానికి కారణం తెలిపింది.సానుభూతి దొరక్క, తనే సముదాయించుకు, వకటికి పదిసార్లు వుత్తరం చదివింది. భర్త రాగానే-'పాపం' మంజూ వ్రాసింది ఎంత మంచిపిల్లో! అంటూ వివరాలన్నీ గుక్కతిప్పుకోకుండా చెప్పేసింది.

'అతను అదృష్టవంతుడు. అప్ప పోగానే చెల్లెల్ని కట్టేసుకుని జీవితాన్ని పూర్ణంగా అనుభవిస్తున్నాడు. వూరికే వాళ్ళకేంబాధో వీళ్ళకేంబాధో-అని బాధ పడే నాలాంటి ముద్దుమొహంవాళ్ళకి వాతలెట్టి కన్నుతెరిపించినట్టుఅన్పిస్తోంది' అంటూ తన గోడుకి పరిష్కారంకోసం కొట్టుమిట్టాడుకున్నాడు.

'ఓహో—ఇప్పుడు' కూడా మీ ఘన తనే చెప్పుకొంటున్నారే — ఏమిటీ, మంజూకీ, భర్తకీ పట్టిన అదృష్టమా? అది భరించలేకే బోలెడు ఏడుస్తూ ఓ దస్తా కాయితాలు నింపేసింది...పోనీ ఆ ఏడుపు ఎందుకులెండి? మీరూ ఆ అదృష్టాన్ని పట్టించుకుని వూరేగండి! కానీ ఒహటే మాట మళ్ళీ నన్ను ఈ గడప తొక్కనివ్వకండి. నేనూ తొక్కను ఏం? ఎక్కడో వో బోట పడివుంటాను. లేదా, ఏదో వో పని చేసుకుబతుకుతాను' —అంటూ ఘర్షణ పెంచేసుకుని, విశ్రాంతి లేకుండా ఏడుస్తూ పడుకుంది...సీత. ఎందుకో తనకి వూరికే కోపంవొస్తోంది. ఏవేవో ఆలోచనల్లో మునిగి ఎన్నో వూహలకి తావు కల్పించుకుని, ఎప్పుడో చాలారాత్రి తిరిగేక నిద్రలో జారింది.

మళ్ళీ తెల్లారటంతో జీవితానికి బోలెడు పనులు. ఇవి చూసుకు ఇదంతా నాదేనని అనుకుంటూ ఇల్లాలు బానిసగా బ్రతుకుతోంది. శాసించాననుకుంటూ శాసనానికి తల వొగ్గుతోంది. మనుషులు ప్రేమకీ ఆ పేరుకి విపరీతార్థాలు చెప్పుకు ప్రేమకి సమాధి కట్టుకుంటున్నారు. ఈ అమ్మాయిల అహంలోనే వినాశం పుట్టింది.

అసలు అందం మనస్సుల్ని విడిచి

శరీరానికి పరిమితమై వె(్రితలలేసి, మురిపిస్తూ కీచకుల్ని సృష్టించి, ధర్మ పన్నాలని వల్లిస్తే వినేందుకు, విరాటుడికి కూడా విసుగే ఈనాడు !...సీత తన వూహలపై కసురుకుంది.పొద్దున్నే ఇదేం బుద్ధీ ? తనకెందుకు ఈ లోకపు మరమ్మత్తూ? పోనీ ఎవరి ఖర్మ వారిదీ. మంజూకి జాలిపడేవాళ్లు కావాలి కనక తనకి వ్రాసిందితప్ప భర్త ఎదట ఎన్ని టక్కులు పోతోందో! నంగనాచి. ఆడ వాళ్ళకి ఎలా తెలుస్తుందో అనేవాడు తన చిన్నప్పుడు బావ...నిజమే తను ఆ విషయంలో వోడిపోయింది. చిన్ననాడు బావని ఆకట్టుకోలేక—ఆ తులసికి వుత్తరాలు చేరవేసి, తనకి దూరం చేసుకొన్న సంఘటనే చాలు...ఇప్పుడు వున్నమతి చెడేట్లుంది. ఉక్రోషంలో తను అందే, కాని...తన భర్త నిజంగా ఆ అమ్మాయిని ఏకాయెకి ఇంటికి పిల్చుకొచ్చేస్తే...తను ... తను ఎక్కడికి పోగలదూ ? గుండెల్లో బరువు వొచ్చినట్టు అయింది. అన్నింటికీ భగవంతుడిదే భారం...అలా అనటంలో ప్రతి ప్రాణికీ తృప్తి దొరుకుతుంది. గాని సీతకి దొరకటంలేదు...పనిమనుషుల ప్రహసనం ప్రారంభంకాగానే-మళ్ళీ ఎండెక్కుతోన్న ధ్యానలోకి పడిపోయింది.

ఆ సాయంకాలం ఎప్పటిలా స్కూటర్ చప్పుడు వినబడలేదు. ఏదేనా కబురు తెచ్చే నౌకరూ రాలేదు. 'సరేలే' అనుకున్నా, మనస్సులో శంకలు గుసగుసలాడ్తూ స్తిమితాన్ని పాడుచేస్తున్నాయి. సీతలోని సీత కోప్పడుతోంది. నువ్వు ఏదో ఒకటి చెయ్యాలి. అతన్ని చివాట్లేసి సంసారం దిద్దేసుకోవాలి. నీలోని కోపానికి స్వస్తి చెప్పేసి, అతనిపైన ఆప్యాయతని చూపిస్తూ అభిమానం సంపాదించుకుంటే — తన జీవితమంత సుఖమైనది మరొకరికి దొరకదు. తనంత అదృష్టం ఎందరికి అనుకుంటూ వుత్సాహంగా ఇల్లుసర్దింది. పక్కలపై తెల్లటి దుప్పట్లు పరిచింది. తనకి నప్పినట్లు అలంకరణచేసుకొంది. అద్దానికి అతుక్కుపోయి అందాన్ని చూసుకుంటూ మురిసింది. కింది పెదిమ కొరుక్కుంటూ మాటి మాటికీ ఎర్రరంగునే చూసుకొంది. కళ్లు బరువెక్కుతున్నాయి. కాలికెలు ఎరుపెక్కి కాటిక అందాన్ని తరిగేట్టు చేస్తున్నాయి.

వీధి చివర కారు హారన్ మ్రోగింది. కుక్కలు అరిచి ఏడుస్తున్నాయి. పెరటి గేటు కీచురాయిలా కుయ్యిమంది. సీత జారే పమిటని సర్దుకుంటూ తలుపు తెరిచింది. తన భర్త వచ్చేశాడు. తన తీర్మానాల్ని చెప్పేయాలని మనస్సు ఆరాటపడుతోంది. గడపలోనే నిల్చుని అతనికేసి చూస్తోంది...అతని వెనక నీడలా అతుక్కున్న అమ్మాయి, ఆలికిడికి వులిక్కిపడింది. ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్లువుంది. ఎవరూ ?

అవును. రాధిక! ఎందుకొచ్చిందీ? పెళ్లిళ్లొద్దని వుపన్యాసాలు అయితే ఇచ్చింది కానీ, ఈ జీవితానికి తోడు కావాలని తెలుసుకొందన్నమాట! ఈ అమ్మాయికోసం పరితపిస్తున్నది తన భర్త? అతన్ని చూసి, అలగాలో అసహ్యించుకోవాలో సీతకి ఆ క్షణాన తట్టలేదు. ఇద్దరూ సీతపక్కనుంచే-కొత్తవాళ్లని తప్పుకవెళ్లే పాతవాళ్లలా వెళ్ళిపోయారు. భర్త మనస్సులో తన కున్నరూపం పిచ్చిదానిగా! అందుకే అతను చూస్తున్నా తనలోని మార్పు గుర్తించలేదు.

రాధికకి చిన్నతనానే స్వేచ్ఛ దొరికింది. ఎంతో అనుభవాన్ని పెనుభూతంలా మోస్తోంది. నడివయస్సులో స్థిరపడాలి తప్పదని రూఢిచేసుకుంది. కాలాన్ని వ్యర్థం చేసుకోదు. ఏడడుగులేం ఖర్మా ? ఏడాదినుంచి నడిపిస్తూ—నడుస్తోంది. ఆలస్యంగా అబ్బిన అలవాట్లకీ, జీర్ణించిన రోగానికీ తిరుగువుండదు... తన గదిలో దీపాన్ని ఆర్పి, పెరట్లో దీపాన్ని వేశారు. అవును. తనకి స్థానం అక్కడే. అందుకే ఒక్కమాటకూడా చెప్పలేదు అతను. అతని నిజరూపం ఆ ఇల్లంతా తిరుగుతూన్న అనుభూతి కలిగింది సీతకి.

ఆమెనోట మాటరాలేదు. గొంతు ఎండినట్లుంది. ఇంట్లోకి వెళ్లడమా, వద్దా? తీరని వేదన ఆవహించి హృదయాన్ని దహిస్తోంది...గేటు తీసేవుంది. ఎక్కడికయినా వెళ్లాలనుంది. ఎక్కడికి వెళ్లాలో తెలియదు. వెళ్లాలి. తనకోసం కంటతడి పెట్టేజీవి ఈ లోకంలో మరొకటిలేదు. అందుకనే విచారం, ఆనందం గుచ్చెత్తిన అనుభవం వచ్చింది.

సీత రోడ్డుదాటి ఏటివెంపుకి నడుస్తోంది. ఇసకదిబ్బపై రావిచెట్టు నీడపడి గాలికి కదుల్తోంది. ఏరు ఏడుస్తున్నట్టు వొదిగి కదులుతోంది.

అతను సీతకి చేరువగా వచ్చాడు. దూరంగా రాధిక అరుస్తోంది. 'ఏమిటిది? ఎదుకు రమ్మన్నావు నన్ను ? నేనేం మీ భాగోతం తెలీక రాలేదు. నీలోని మూర్ఖత్వాన్ని ఆరాధిస్తూ నిన్నూ—నీ సీతనీ పూజించేటంత అంధకారం నన్ను ఆవహించదు!'...ఆ ధ్వని ఒక్కసారి మారుమ్రోగింది. దిక్కులు పలికాయి. ఉలిక్కిపడ్డ పక్షులు వంత పలికాయి. ఏరు బెదిరి అలలుగా తేలి చూసింది.

సీతలోని అభిమానం ఆలోచనల్ని అదిమిపట్టి ముందుకు నడిపించింది. లంగరేసిన పడవలోని దీపం చీకటిని సూటిగా చూస్తోంది. పడవ కదుల్తోంది. మనుషులు కునికిపాట్లు పడుతున్నారు.

సీత తూలుతూ నీటిదరి చేరింది. అతనూ అనుసరించాడు.

'ఏటి బాబు, ఈ పరేసకం? తవరేటీ, ఈ పడవేటీ, నెగండి!' అనే బాపన్నని పోల్చుకున్నాడు.

'ఈ అమ్మగార్ని ఇంటిదగ్గర విడు. నేను తర్వాత వొస్తా!' అన్నాడు.

ఆ కంఠం తొణకలేదు. చెదరలేదు. బెంగగా బేలగా పలకలేదు.

'ఇంతేనా!' అంటూ సీత అరవలేదు!

✻